www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 12 అక్టోబర్ 2024
5
అన్నమయ్య



వృద్ధ దంపతులకు చిరు సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో యాచిస్తూ జీవనం సాగిస్తున్న వృద్ధ దంపతులకు హెల్పింగ్ మైండ్స్ సభ్యులు చిరు సాయం చేశారు. కార్యాలయం వద్ద బరువు చూసుకునే మిషన్ (వెయిట్ మిషన్), పాద రక్షలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబక్కర్ సిద్ధిక్ మాట్లాడుతూ వృద్ధ దంపతులకు బరువు చూసి ఎవరైనా తమ వంతు సహాయం చేయాలని, తమ వంతుగా చిరు సాయం అందించినట్లు పేర్కొన్నారు. మానవ సేవే, మాధవ సేవ అన్న సూక్తిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరాం, ఖాజా, అర్షద్ పాల్గొన్నారు.


వృద్ధ దంపతులకు దుప్పట్లు అందజేస్తున్న సభ్యులు

సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు



- కడపలో 206, అన్నమయ్యలో 94 సంఘాలు
- 16న ఎన్నికల నోటిఫికేషన్..?
- సభ్యత్వ నమోదుపై మల్లగుల్లాలు

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ కసరత్తు ఊపందుకుంది. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన నీటిపారుదల శాఖ జిల్లా అధికార యంత్రాంగాలు ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాయి. చెరువుల వారీగా ఎన్నికల అధికారుల నియామకంపై దృష్టి సారించాయి. ఉమ్మడి జిల్లాలకు చెందిన 300 చెరువుల కింద పంటలు సాగుచేస్తున్న రైతుల సభ్యత్వ నమోదు దగ్గర నుంచి ఎన్నికల అధికారుల నియామకం, ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించడం తదితర అంశాలపై దృష్టి సారించింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలో 206, అన్నమయ్య జిల్లాలో 94 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కడప జిల్లా సాగునీటి పారుదల శాఖ పరిధిలో ఆరు ఇరిగేషన్ సర్కిల్స్ పరిధిలోని మైనర్ 112, మీడియం 16, మేజర్ 78 వెరసి 206 సాగునీటి సంఘాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 94 సాగునీటి సంఘాలు ఉండడం గమనార్హం. 2015లో అప్పటి టిడిపి సర్కారు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం తెలిసిందే. సుమారు పదేళ్లుగా సాగునీటి సంఘాలు మనుగడలో లేకపోవడంతో రైతుల్లో ఉత్సాహం కొరవడి నట్లు కనిపిస్తోంది.

నోటిఫికేషన్‌పై అధికారుల దృష్టి

ఈ నెల 16న సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా మండలాల వారీగా చెరువుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. చెరువుల జాబితా రూపకల్పన చేసిన అనంతరం ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీరింగ్ స్థాయి అధికారులను నియామకాలను పూర్తి చేశారు. వీరికి అనుబంధంగా ఆయా మండలాలకు చెందిన తహశీల్దార్ స్థాయి అధికారుల నియామకం చేపట్టాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. వీరికి అనుబం ధంగా అదనపు సిబ్బందిని నియమించాల్సి ఉంది.

సభ్యత్వం..సంసిద్ధం..

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల దగ్గర నుంచి ఆయా చెరువుల పరిధిలో సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టడంపై దృష్టి సారించాల్సి ఉంది. ఆయా చెరువుల పరిధిలోని సాగు విస్తీర్ణాన్ని బట్టి వందలాది మంది రైతులు ఉన్న సంగతి తెలిసిందే. వీరందరూ సభ్యత్వ నమోదు చేయడానికి ముందు ఎకరాకు రూ.200 చొప్పున నీటి పన్ను చెల్లించడం మొదలగు నిబంధనలను పాటించాల్సి ఉంది. రెండేళ్లుగా వర్షాలు లేక పంటలు పండని నేపథ్యంలో ఎంతమంది రైతులు సభ్యత్వ నమోదుకు ముందుకొస్తారనే అంశంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. సభ్యత్వ నమోదుకు ముందుకు వచ్చిన వారితోనే ఎన్నికల తంతు నిర్వహించాలనే ఉద్దేశంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికార యంత్రాంగాలు సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించడం, ఎన్నికలు నిర్వహించడం, ఫలితాలు ప్రకటన చేయడంపై దృష్టి సారించినట్లు కనిపిస్తోంది.

పారదర్శక ఎన్నికలు సాగేనా!

2015లో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికల ఫలితాల ప్రకటనలో పారదర్శకత కొరవడిన సంగతి తెలిసిందే. అప్పటి సాగునీటి సంఘాల ఎన్నికలను అధికార పార్టీ మెజార్టీ సంఘాలను ఏకగ్రీవం చేసుకుందనే ఆరోపణల ఉన్నాయి. ఒంటిమిట్ట సాగునీటి సంఘ ఎన్నికపై ప్రత్యర్థులు కోర్టును ఆశ్రయించిన ఘటనలు ఉన్నాయి. తాజా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో గత అప్రజాస్వామిక పోకడలు పునరావృతం గాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాం

జిల్లాలో సాగునీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాం. చెరువుల వారీగా జాబితా సేకరణ దగ్గర నుంచి ఇరిగేషన్ అధికారులను నియమించడమైంది. కలెక్టర్ ఆదేశాల అనంతరం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తాం.


- కె.శ్రీనివాసులు, ఎస్ఇ, ఇరిగేషన్, కడప.

భగ్గుమంటున్న ధరలు

- ఆకాశాన్నంటిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు
- మధ్య తరగతి కుటుంబాల్లో కనపడని పండుగలు
- ధరలు నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం

పెరిగిన నిత్యావసర ధరల ఆకాశంలో అంటడంతో పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో పండగలు జరుపుకునే పరిస్థితి లేకుండా పోతుంది. మార్కెట్లో ధరలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. సామాన్యుడు రూ.500 తీసుకుని మార్కెట్టుకు వెళ్తే పట్టుమని నాలుగు రకాల కూరగాయలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. మార్కెట్లో టమోటాను పట్టుకుంటే దాని ధర తారెత్తిస్తోంది. పచ్చిమిర్చి ధర ఘాటెక్కి తనను ముట్టుకోవద్దంటోంది. ఇలా ప్రతి కూరగాయీ సామాన్యుడిని ముట్టుకోనీయడం లేదు. ఎందుకంటే వాటి ధరలు అంత అమాంతంగా పెరిగి ఆకాశానికి నిచ్చవేశాయి.

ప్రజాశక్తి-రాయచోటి





జిల్లాలోని రాయచోటి, సంబేపల్లి, చిన్నమండెం, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లి ప్రాంతాల్లో టమోటాల సాగు అధికంగా సాగు చేస్తారు. ఇటీవల టమోటా, ఎర్రగడ్డ, తెల్లగడ్డ ధర బాగా పెరగడంతో ఇదే అదునుగా దళారీలు సొమ్ము చేసుకుంటూ అధిక ధరలకు విక్రయించడం మొదలుపెట్టారు. ఇదేమిటి అంటే కూరగాయల సాగు తగ్గిందని ధరలు పెరిగాయి అంటూ చెప్పి సామాన్యులను దోపిడీ చేస్తున్నారు. గతంలో కిలో టమోటా ధర రూ.5, రూ.10లు ఉండగా నేడు ఏకంగా రూ.50 నుంచి రూ.80 వరకు చేరింది. నిత్యం వంటకాల్లో టమోటా అవసరం తప్పదు కాబట్టి ఎంత ధర పెట్టి అయినా కొనుగోలు చేస్తున్నారు. నిత్యం కూరల్లో ఉపయోగించే ఉల్లిపాయలు కూడా గతంలో రూ.15 ఉండగా నేడు ఒక్కసారిగా రూ.55కు మార్కెట్లో విక్రయిస్తున్నారు. వీధి దుకాణాల్లో కిలో రూ.60 చొప్పున అమ్ముతున్నారు. బీరకాయలు ధరలు కూడా సామాన్యుడికి అందుబాటులో లేకున్నాయి. ఇక నూనె రూ.140, వెల్లుల్లి రూ.450 అమ్ముతున్నారు. ఈ సారి పంట తక్కువగా ఉందని, గిరాకీ బాగా పెరిగిందని దుకాణదారులు చెప్పడం గమనార్హం. ఇక ఆకుకూరల ఆరోగ్యానికి ఎంతో మంచివని వైద్యులు చెప్పడంతో వాటి ధరలు సైతం ప్రస్తుతం మార్కెట్లో అమాంతంగా పెరిగాయి. ఏ ఆకు కూరను తీసుకున్నా రూ.15 ఉంది. మెంతి ఆకు, పాలకు, చుక్కాకు, గోంగూర, మునగాకు వంటివి కూడా అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక ఆదివారం వస్తే మాంసంలోకి కచ్చితంగా వాడే పుదీనా, కొత్తిమీర, అల్లం వంటివి కూడా ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు కొనాలింటే ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ధరల నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది ప్రజలు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలో రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ధరలను నియంత్రించాల్సిన అధికారులు ఏ ఒక్కరూ రైతు మార్కెట్ వైపు చూసిన పాపాన పోలేదు. కూరగాల తూకాల్లోనూ మోసం చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యవసర, కూరగాయలు తూనీకల తనిఖీలు అధికారులు కూడా జిల్లాలో ఎక్కడ కూడా తనిఖీలు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధితాధికారులు రైతు బజార్లలో, మార్కెట్లలో సందర్శించి కూరగాయల ధరలు తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

కూరగాయలు..: టమోటా రూ.50, వంకాయ రూ.50, ఉల్లిపాయలు రూ.55, బెండకాయ రూ.40, పచ్చిమిరప రూ.40, చిక్కుడు రూ.60, మటిక రూ.50, బూడిద గుమ్మడి రూ.40, అలసందకాయలు రూ.70, అల్లం రూ.220, క్యాప్సికమ్ రూ.80, బీరకాయలు రూ.40, తీపి గుమ్మడి రూ.30, క్యారెట్ రూ.60, బీట్రూట్ రూ.40 ముల్లంగి రూ.50, కాకరకాయ రూ.40, క్యాబేజీ రూ.40, బీన్స్ రూ.120, కోడిగుడ్లు డజన్ రూ.70 చొప్పున అమ్ముతున్నారు.

ఆకుకూరలు.. : కొత్తిమీర కట్ట రూ.30, మెంతి ఆకు రూ.10, గోంగూర కట్ట రూ.10, కరివేపాకు రూ.20, పుదీనా రూ.20, మునగాకు రూ.30, సిర్రిఆకు రూ.30, కోయిటాకు రూ.20, పచ్చి మామిడి రూ.100 చొప్పన అమ్ముతున్నారు. గ్యాస్, వంట నూనెల ధరలు కూడా అమాంతంగా పెరిగిపోయాయి. పండుగ అంటేనే ఇళ్లల్లో వంటతో మొదలు పెడతారు. అలాంటి పరిస్థితుల్లో పిండి వంటలు చేసుకుని ఇంటిల్లపాదు ఆనందంగా కడుక్కునేందుకు ఉత్సాహం చూపుతారు. పండుగ జరుపుకోవాలంటేనే ప్రజలు జంకుతున్నారు.


ధరలు తగ్గించాలి



మార్కెట్లోకి కూరగాయలు కొనడానికి వెళ్లాలంటే భయమేస్తోంది. గతంలో ఎప్పుడు లేని విధంగా కూరగాయల ధరలను పెంచి అమ్ముతున్నారు. మార్కెట్లకు వెళ్తే ఏ కూరగాయలు కొని తినే పరిస్థితులలో లేం. అధికారులు స్పందించి కూరగా యల ధరలు వెంటనే తగ్గించాలి.

ఎస్.మషురూన్ బి, గృహిణి, రాయచోటి.

ధరలు నియంత్రించాలి.



కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ విపరీతంగా రేట్లను పెంచడంతో నిత్యావసర, కూరగాయలు రేట్లు అధికమయ్యాయి. రైతుల కంటే దళారులు ఎక్కువ ఫలితం పొందుతున్నారు. రైతులు, వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్లో అధిక రేట్లు అమ్ముతూ పేదల నుంచి దోచుకుంటున్నారు. పేదలు పండగ జరుపుకోవాలంటే ప్రభుత్వం వెంటనే స్పందించిన ధరలు నియంత్రించాలి.

-సిరిపురి రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, రాయచోటి.


యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎపి జెఎసి సెక్రెటరీ జనరల్ కెఎస్ఎస్ ప్రసాద్‌ని కోరినట్లు అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ తెలిపారు. కడప జిల్లా పర్యటనలో భాగంగా యుటిఎఫ్ కడప జిల్లా కార్యాలయానికి విచ్చేసిన ప్రసాద్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ నెంబర్ 51 ప్రకారం డిఎ అరియర్స్ బిల్లులు సిఎఫ్ఎంఎస్‌లో తయారు చేసుకోవడానికి మళ్లీ అవకాశం కల్పించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ, ఖజానా శాఖ అధికారులతో ప్రాతినిధ్యం చేయాలని కోరామన్నారు. 2023-24 సంవత్సరాలలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించిన, జవాబు పత్రాల మూల్యాంకనం చేసిన వారికి రెమ్యూనరేషన్ జిల్లా విద్యాశాఖ అధికారులు నేటికీ చెల్లించలేదున్నారు. ఈ విషయమై జిల్లా స్థాయిలో అధికారులకు అనేకసార్లు ప్రాతినిధ్యాలు, పోరాటాలు చేసినప్పటికీ చలనం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టర్‌కి ప్రాతినిధ్యం చేయాలని కోరామని తెలిపారు. పని సర్దుబాటులో భాగంగా 44 మంది ఉపాధ్యాయుల గ్రీవెన్స్‌లను అన్నమయ్య జిల్లా డిఇఒ రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి పంపించారని చెప్పారు. ఆ గ్రీవెన్స్ పరిష్కారానికి విద్యాశాఖ కమిషనర్‌కి ప్రాతినిధ్యం చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సురక్షిత గమ్యం..హెల్మెట్‌తోనే సాధ్యం : సిఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సురక్షిత గమ్యం.. హెల్మెట్‌తోనే సాధ్యమని మదనపల్లె ఒకటో పట్టణ సిఐ చాంద్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మదనపల్లె-బెంగళూరు రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా బైకులు నడుపుతున్న వారిని గుర్తించి, కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రాణం యొక్క విలువను వివరించారు. కుటుంబ సభ్యులు రక్త సంబంధీకులు, ఆత్మీయులను కోల్పోతే ఆ కుటుంబం ఎంతటి కష్టాల్లో కూరుకుపోతుందో వివరించారు. ఒక్కసారి మానసిక స్థైర్యాన్ని కోల్పోతే ఆ కుటుంబం కోలుకోవడం కష్టమన్నారు. కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై అన్సర్ భాష, సిబ్బంది సయ్యద్ బాషా, తేజ సింహ, జమీర్, లత తదితరులు పాల్గొన్నారు.


వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పిస్తున్న చాంద్‌బాషా

ఆడపిల్లల భవిష్యత్తుకు పునాదులు వేద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ఆడపిల్లల్ని చదివిద్దాం, భావితరాల ఉత్తమ భవిష్యత్తుకు పునాదులు వేద్దామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఐసిడిఎస్, వైద్య ఆరోగ్యశాఖ, విద్యా శాఖల ఆధ్వర్యంలో కలెక్టర్ శ్రీధర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారతను సాధించాలంటే అమ్మాయిలందరికీ చదువుకునే అవకాశం కల్పించాలని తెలిపారు. సమాజంలో అమ్మాయిలు చదువుకుంటే భవిష్యత్తులో సమాజాలను పురోగతివైపు నడిపించడంలో వారే కీలక పాత్ర పోషిస్తారన్నారు. జిల్లాలో ప్రతి అమ్మాయి చదువుకునే విధంగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. సమాజంలో ఆడపిల్లల పాత్రను గుర్తించేందుకు, ఆడపిల్లలను రక్షించేందుకు ప్రధానమంత్రి మోడీ "బేటి బచావో బేటి పడావో" అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. జిల్లాలో బాల్య వివాహాలను రూపుమాపేందుకు అధికారులు అన్ని విధాల కృషి చేస్తున్నారన్నారు. బాల్య వివాహాలు అరికట్టే ప్రక్రియలో అధికారులకు ఎవరైనా భంగం కలిగిస్తే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా సంరక్షణ కార్యదర్శులు కలిసికట్టుగా పనిచేసి అన్నమయ్య జిల్లాను బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చి దిద్దాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాల మీద కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ (నివారణ) చట్టం 1994ను కట్టుదిట్టంగా అమలు చేయాలని గుర్తు చేశారు. జిల్లాలో ప్రతి 1000 మంది అబ్బాయిలకు 943 మంది అమ్మాయిలు మాత్రమే ఉన్నారని, ఈ నిష్పత్తిని సమం చేసేందుకు "బేటి బచావో-బేటి పడావో" కార్యక్రమాలను గ్రామ స్థాయిలో చేపట్టి లింగ నిష్పత్తిని పెంచేందుకు కృషి చేయాలన్నారు.అనంతరం జిల్లా స్త్రీ , శిశు సంక్షేమ, సాధికారత అధికారి రమాదేవి మాట్లాడుతూ అంతర్జాతీయ బాలిక దినోత్సవంలో భాగంగా కిషోర బాలికలను అంగన్వాడీ కేంద్ర పరిధిలో గుర్తించి వారికి, వారి కుటుంబ సభ్యులకు బాల్య వివాహాల పట్ల, బాలిక విద్య యొక్క ప్రముఖ్యతను తెలియచేయాలని సిబ్బందిని కోరారు. అనంతరం అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బాల్యవివాహాలు నిలుపుదల చేయుటలో కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ మెమోంటోలను అందించి గౌరవించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య, జిల్లా బాలల పరిరక్షణ విభాగ సిబ్బంది, సిడిపిఒలు, సూపర్వైజర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌శ్రీధర్

పీలేరు: బాలికల పట్ల వివక్ష చూపడం కుటుంబ అభివృద్ధికి అవరోధం అవుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. బాలికల హక్కుల్లో భాగంగా విద్య, పోషణ, ఆరోగ్యం, లింగ వివక్ష లేని శ్రద్ధ తల్లిదండ్రుల నుంచే మొదలైనప్పుడే అన్నిరంగాల్లో ఆడబిడ్డ అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. బాలికల అక్షరం ఆసరా చేసుకుని హక్కుల సద్వినియోగం, వివక్ష రూపుమాపే దిశగా అవగాహన అవసరమని బాలికలకు వివరించారు. అనంతరం ఆడబిడ్డ రక్షణ-అందరిబాధ్యత, సృష్టికి మూలం ఆడబిడ్డ, ప్రగతికి చిహ్నం ఆడబిడ్డ అంటూ నినాదాలు చేస్తూ బాలికల సహకారంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నాగవేణి, ఆశ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

'మానవ అక్రమ రవాణా తీవ్రమైన నేరం'


హత్యలకు గురైన వారికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మానవ అక్రమ రవాణా తీవ్రమైన నేరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల సమాఖ్య గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో వెలుగు ప్రత్యేక పాఠశాలలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మొదటిగా మానవ అక్రమ రవాణాకు గురైన వారు, హత్యలకు బలైన వారి కొరకు పూలతో నివాళు లర్పించి, కొవ్వొత్తులతో మౌనం పాటించారు. నేటి సమాజంలో జరుగుతున్న ఘటనలపై అందరూ అవగాహన పెంచుకోవాలని, పేదరికం నిర్మూలించాలని, జ్ఞానాన్ని పెంపొందించాలని, ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేటట్లు నడుచుకోవాలని, ప్రేమ, పెళ్లి, ఉద్యోగాలు, ఉపాధి, సినిమాల్లో అవకాశాల పేరుతో అక్రమ రవాణాను అరికట్టే దిశగా అవగాహన కల్పించాలన్నారు. మహిళలు, చిన్నారులు, బాలికలను లైంగికంగా వేధించే వారిని కఠినంగా శిక్షించాలన్నారు. సమాజంలో హింస ప్రవృత్తిని నివారించడానికి అడహక్ కమిటీని వేశారని, రాబోవు రోజుల్లో ఇలాంటి అఘాయిత్యాలు జరగకుండా కమిటీ పర్యవేక్షిస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించేటట్లు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థలకు అప్రిషియేషన్ సర్టిఫికేట్ అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలైన గ్రామ జ్యోతి సొసైటీ బి.సుభద్ర, వెలుగు ఉదయ మోహన్ రెడ్డి భాగ్యలక్ష్మి, వైఎస్ మునిరత్నం, సామాజిక కార్యకర్త డాక్టర్ యమలా సుదర్శనం, సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు ముని గోపాలకృష్ణ, రీడో సంస్థ నాయకులు ఈశ్వరయ్య, పసల పియర్స్ సంస్థ, వేమ నారాయణ పవిత్ర సేవా సంస్థ, బొజ్జప్ప ప్రెస్ సంస్థ, లలితమ్మ పోర్డ్ సంస్థ, కవిత రాణి, కృష్ణ చరణ్ చైతన్య సర్వీస్ సొసైటీ, కలిచెట్ల రెడ్డి గణేష్ యువశక్తి ఫౌండేషన్, అబూబకర్ హెల్పింగ్ మైండ్స్ సొసైటీ, జివిఎస్ బాబు గ్రేట్ విజన్ సంస్థ, కరాటే మాస్టర్ ఎఆర్ సురేష్, మోహన డిలీట్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సంస్థ, కరుణ సమాజ సేవకులు, శివ, రెడ్డి శేఖర్, శశి, స్వీటీ, వరలక్ష్మి, గ్రామ జ్యోతి, సొసైటీ సిబ్బంది, శివశక్తి ఫౌండేషన్ టీం వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. సహాయ, సహకారాలు అందించిన వెలుగు ఉదయ మోహన్ రెడ్డికి గ్రామ జ్యోతి సొసైటీ తరఫున స్వచ్ఛంద సంస్థల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నర్సింహానంద్‌ను ఉరితీయాలి

- పట్టణంలో ముస్లింల శాంతియుత ర్యాలీ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మహమ్మద్ ప్రవక్త అంటే ముస్లింలకు ఎంతో ప్రేమ, మొత్తం ప్రపంచ మానవాళికి శాంతిని బోధించిన వ్యక్తి అలాంటి వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసి ముస్లింల మనోభావాలు దెబ్బతీయడం సరైనది కాదని ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జమయత్ ఉల్మాయే హింద్ ఆధ్వర్యంలో ఠాణా సర్కిల్ నుండి పెద్ద ఎత్తున ముస్లింలు శాంతియుత ర్యాలీ చేపట్టి స్థానిక తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌కు చెందిన నరసింహానంద్‌ను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఇతనిపై 20కి పైగా కేసులో ఉన్నాయని కోర్టు ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయరాదని షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తే తిరిగి మళ్లీ ముస్లింల మనోభావాలు దెబ్బ తినే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నాడని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 నుండి 28 వరకు ఉన్న మత స్వేచ్ఛ హక్కును హరించే విధంగా భారతదేశంలో ఉన్న కొందరు పనికట్టుకొని ఇస్లాంపై వారి ఆచారాలపై కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భారతదేశంలో హిందూ ముస్లిం సోదరులు కలిసిమెలసి ఉన్నారని నరసింహా నంద్ లాంటి వ్యక్తులను అరెస్టు చేయడంతో దేశంలో శాంతిని నెల కల్పవచ్చున్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఏ మతం వారైనా వేరొక మతం వారిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తే కఠినంగా శిక్షించే విధంగా చట్టాలు తేవాలని కోరారు. ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.మరోసారి ఇస్లాంను కానీ మహమ్మద్ ప్రవక్తను కానీ కించపరిచే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జమాయత్ ఉలమా ఎ హింద్ రాయచోటి శాఖ అధ్యక్షులు మౌలానా ఇందాద్ ఖాస్మి, షావుల్ హమీద్, మస్తాన్, లోకం బీడీ అష్రఫ్ బేగ్, అమీర్జాన్, సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి షేక్ అఫ్ తాబ్, సభ్యులు నిజాం ఖాన్, జిలాన్, ఇలియాస్ బేగ్, టిడిపి నాయకులు అతావుల్లా, బో నవల్ల ఖాదర్ వలీ, జనతా బషీర్, ఆరిఫ్, కోటి చాన్ భాష, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మంత్రి 'మండిపల్లి' రాక

ప్రజాశక్తి-రాయచోటి

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం జిల్లాకు రానున్నారని కలెక్టరేట్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు సూచించిన మేరకు మంత్రి పర్యటన వివరాలు.. ఉదయం ఎనిమిది గంటలకు రాయచోటి పట్టణంలోని వీరభద్ర స్వామి వారికి మంత్రి కుటుంబ సమేతంగా పట్టు వస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు రాయచోటి కిరాణా మర్చంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గాంధీ బజార్‌లో సరసమైన ధరలకు వంట నూనెల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు సంబేపల్లి మండలంలోని అడవి కమ్మపల్లె గ్రామంలో మంత్రి దసరా ఉత్సవాలలో పాల్గొంటారన్నారు. అనంతరం అక్కడ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.



రోడ్డుపై ఏపుగా పెరిగిన కంపచెట్లు

ప్రమాదకరంగా రాయచోటి-కదిరి రహదారి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోరాన్‌చెరువు పంచాయతీ వడిసెలవంకపల్లి పరస వద్ద నుంచి రాయచోటి వరకు రోడ్డుకు ఇరువైపులా పరికి చెట్లు విస్తరించడంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన దారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై ఎదురుగా బస్సు నుంచి తప్పించుకునేందుకు పక్క వెళ్లాలంటే రోడ్డుపై ఏపుగా పెరిగిన ముళ్ల కంపల్లోకి వెళ్ళాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా దట్టంగా ఏపుగా చెట్లు పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనం కూడా కనిపించకుండా పోయే పరిస్థితి ఏర్పడ్డాయి. బుధవారం సాయంత్రం ట్రాక్టర్ ద్విచక్ర వాహనం ఢీకొని జంగంపల్లికి చెందిన వరుణ్‌కుమార్ అనే యువకుడు మృతి చెందాడు. ఈ ఏడాది ఈ రోడ్డు ప్రమాదంలో ఆరుగురు చెందారు. ప్రమాదాలకు నిలయంగా మారినీ రోడ్డుపై జంగిల్ క్లియరెన్స్ చేయాల్సిన బాధ్యత రోడ్లు భవనాలశాఖపై ఉందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

16న కలకడ మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కలకడ

మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 16వ తేదీన నిర్వహి స్తున్నట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ఆధ్వర్యంలో ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు తమ తమ నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

14 నుంచి పల్లె పండుగ వారోత్సవాలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-కలకడ



మాట్లాడుతున్న ఎంపిడిఒ అబ్దుల్ రహీం

పల్లె పండుగ వారోత్సవాలను ఈనెల 14వ తేదీ నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ అబ్దుల్‌రహీం తెలిపారు. మండలంలోని అన్ని పంచా యతీలలో జరిగే ఈ పల్లె పండుగ వారోత్సవాలలో గ్రామీణ ప్రాం తాలలో మంజూరైన సిసి రోడ్లు వేయడానికి ప్రారంభోత్సవాలు చేయడం జరుగుతుందని తెలిపారు. 14న బాలయ్యగారిపల్లి పంచాయతీ నాయనవారిపల్లి కొత్తపల్లి, నాయన వారిపల్లెలలోను, అదే రోజు 11 గంటలకు కలకడలోను, 12 గంటలకు బాటవా రిపల్లి పంచాయతీ బీసీ కాలనీలో జరుగుతుందన్నారు. 15న ఉదయం 10 గంటలకు దేవులపల్లి పంచాయతీ దేవులపల్లిలోను, 11 గంటలకు దొడ్డిపల్లి పంచాయతీ గోపాలపురం, కే.దొడ్డిపల్లెలలో, అదేరోజు 12 గంటలకు గంగాపురం పంచాయతీ గంగాపురం, రంగప్పగారిపల్లి లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 17న ఉదయం 10 గంటలకు ఏనుగొండపాలెం పంచాయితీ కోరేవాండ్లపల్లి, రంగప్ప గారిపల్లిలలోను, 11 గంటలకు దిగువతాండ పంచాయతీ దిగుతాండ, 12 గంటలకు కదిరాయిచెరువు పంచాయతీలోనూ, 18న 10 గంటలకు ముడియంవారిపల్లి పంచాయతీ గుర్రంవాండ్లపల్లి, ఎస్‌టి కాలనీలలోను, 11 గంటలకు నవాబుపేట పంచాయతీ చావిడికాడపల్లి లోనూ, 19న ఉదయం 10 గంటలకు కోన పంచాయితీ తిప్పిగారిపల్లి లోను, 11 గంటలకు రాతిగుంటపల్లి పంచాయతీ ఎగువ బట్ట వారి పల్లె లోను, 12 గంటలకు ఎర్రకోట పల్లి పంచాయతీ వెంకటగారిపల్లిలలో జరుగుతుందన్నారు. ఆయా పంచాయతీలో జరిగే పల్లె పండుగ కార్యక్రమానికి కేటాయించిన అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.



చిన్నమండెం : మెమోంటో అందుకుంటున్న సూపర్‌వైజర్ శారదమ్మ

అంగన్వాడీ సూపర్‌వైజర్లకు ప్రశంసలు

ప్రజాశక్తి-చిన్నమండెం : అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చామకూరి చేతుల మీదుగా ఐసిడిఎస్ సూపర్వైజర్లు శారదమ్మ, పవన కుమారిలను మొమెంటోలు అందుకున్నారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని శ్రీరామ్‌నగర్, దిగువగొట్టివీడు గ్రామాలలో రెండు బాల్య వివాహాలను ఆపడంలో కీలక భాగస్వామిగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ రమాదేవి, డిఎంహెచ్ఒ కొండయ్య, డిఇఒ శివ ప్రకాష్‌రెడ్డి, జిల్లా ఐసిడిఎస్ సిడిపిఒలు, సూపర్వైజర్లు, సచివాలయ మహిళ పోలీసులు పాల్గొన్నారు. **రామాపురం:** ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మజరాణి మెమెంటో అందుకున్నారు. మండలంలో నల్లగుట్టపల్లె సరస్వతిపల్లి దళితవాడ కుమ్మరపల్లి గ్రామాలలో మూడు బాల్య వివాహాలను ఆపడంలో కీలక భాగస్వామి కావడంతో కలెక్టర్ చేతుల మీదుగా మొమెంటో అందుకున్నారు.

గుండెపోటుతో ఆర్‌టిసి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-కలికిరి: గుండెపోటుతో ఆర్‌టిసి డ్రైవర్ అంకన్న మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచే సుకుంది. కలికిరి పట్టణం, అమరనాథ్‌రెడ్డి కాలనీకి చెందిన ఆర్‌టిసి డ్రైవర్ అంకన్న కు రెండు రోజుల క్రితం గుండె పోటు రావడంతో చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలిం చారు. మృతి చెందాడు. టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, జనసేన నాయకులు కుటుంబ మృతుడి సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, **నా క్లయింట్ జి.సుబ్రమణ్యం తండ్రి జి.రాజన్న** గారి సూచనల మేరకు తెలియజేయడం ఏమనగా!

నా క్లయింట్ జి.సుబ్రమణ్యం తండ్రి జి.రాజన్న గారు డోర్ నెం.1-529, కోటపల్లి రెసిడెన్సియల్ ఏరియా, వార్డు నెం.1, సర్వే నెం.511-7, పీలేరు గ్రామం నందు 113.38 చ॥గ॥ లేక 28.34 అంకణములు గల జాగాను, ఆర్.అనిత భర్త ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి గారి వద్ద కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొన్నారు. సదరు ఆర్.అనిత భర్త ఆర్.చంద్రశేఖర్ రెడ్డి గారి ఒరిజినల్ పత్రములు నెం.160/ 2002, 778/ 2001, 779/2001, 1637/2005 లను పోగొట్టుకున్నట్టు మాకు తెలిపారు. దానికి నా క్లయింట్ అంగీకరించి, ఈ కొనుగోలు లావాదేవిని నకలు పత్రముతో జరుపదలచారు. సదరు పత్రములు ఎంత వెతికినను దొరకలేదు. సదరు ఒరిజినల్ డాక్యూమెంట్స్ ఎవరికైనా దొరికిన యెడల నాకు గాని లేక నా క్లయింట్‌కు గానీ ఇవ్వవలసినది. అట్టు కాకుండా సదరు పత్రము పై ఏ లాంటి విక్రయ,అగ్రిమెంట్, తనఖాలు చేసిన యెడల అవి చట్టరీత్యా ఎంతమాత్రము చెల్లనేరవు. అట్టివార్ల పై నా క్లయింట్ తీసుకును సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని హెచ్చరించడమైనది కావున, పైన పేర్కొన్న షెడ్యూలు ఆస్థి పై ఎటువంటి ఆక్షేపణలు, ఆరోపణలు ఎవరికైనను ఉన్న ఎడల ఈ ప్రకటన ప్రచురించిన తేది మొదలు ఏడు (7) దినముల లోపల క్రింద తెలిపిన అడ్రస్సుకు తెలియపరచవలసినదిగా తెలియజేయడం అయినది.

షెడ్యూలు:

అన్నమయ్య డి.పీలేరు సబ్.డి.కి చేరిన పీలేరు మండలం, పీలేరు గ్రామపంచాయితీకి చేరిన, పీలేరు గ్రామం, వార్డు నెం.1, కోటపల్లి రెసిడెన్షియల్ ఏరియా డోర్ నెం.1-529 గల ఇంటికి సమీపమున కొత్తగా నిర్మిస్తున్న డోర్ నెంబరు లేని కొత్త ఇంటి వివరం సర్వే నెంబరు 511-7 రులో గల ఇంటికి చెక్కుబంది వివరం. **తూర్పు:** పి.శిద్దరామయ్య, పి.అశోక్ గార్ల ఇల్లు, **పడమర:** ఇ.మమత జాగా, **ఉత్తరం:** యన్.రమేష్ జాగా మరియు ఆది ఇల్లు, **దక్షిణం:** 15 అడుగుల వెడల్పు గల రోడ్డు ఈ మధ్య తూర్పు, పడమర - ఇరువైపుల 26 అడుగులు ఉత్తర, దక్షిణం-తూర్పు దిశన: 40 అడుగులు, పడమర దిశన: 38 1/2 అడుగులు, యిందుకుసరియగు 113.38 చదరపు గజములు లేక 28.34 అంకణములు గల జాగాయున్నూ, ఈ జాగాలో నిర్మిస్తున్న అసంపూర్తి ఆర్.సి.సి. మోల్డింగ్ మిద్దె పూరా.

ఆర్.రాజేష్, అడ్వకేట్
డి.నెం.12-6-12, ప్రశాంతి నగర్, తిరుచానూరు.
సెల్ నెం. 9640720904

IN THE COURT OF THE Prl. JUNIOR CIVIL JUDGE, MADANAPALLE
O.S.No. 981/2021

D.Venkata Ramana Reddy. ...Plaintiff
Vs
K.Amarnath. ...Defendant

SUMMONS TO DEFENDANT

K.Amarnath, S/o Late, K.Siddappa, D.No.III-146-3-02, Sapthagiri Nagar, Madanapalle.

పై కేసులో కోర్టు నుండి వచ్చు సమన్లును తీసికోనందున పేపర్ ప్రకటన ద్వారా 16.10.2024 నాడు ఉదయం గం.10.30 లకు నీ హాజరు నిమిత్తము ఉన్నది. నీవు హాజరు కానంతట నీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//
A.MOHAN KUMAR,
B.A.,L.B.L.,
Advocate,
MADANAPALLE.

ఈ రోడ్డుకు మోక్షమెన్నడో?

- ప్రమాదాలకు నిలయంగా రహదారి
- ఆందోళన చెందుతున్న వాహనదారులు
- పట్టని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి-వీరబల్లి

మండల కేంద్రం వీరబల్లి నుంచి వంగిమళ్ళ, డి.రాచపల్లికి వెళ్లే రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారి వెంబడి మూడు కిలో మీటర్ల మేర రోడ్డంతా కంకర తేలి, గుంతలమయమై నీరు నిలిచి పోవడంతో ప్రమాదం ఎప్పుడు జరుగుతోందనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు మార్గాన్ని బాగు చేసేదెవరి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలానికి పోవాలంటే ఈ రోడ్డు ప్రయాణం నరక ప్రాయంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. మాండవ్య నది నుంచి పొలుచెన్నారెడ్డిగారి పల్లి చివరి వరకు రోడ్డు అంతా గుంతలు పడి నీటి తో కప్పబడి వుంది. గతంలో కురిసిన వర్షాలకు గంగనేరువాగుపై వేసిన కల్వర్టు కొట్టుకుపోయింది. గంగనేరు వాగు నుంచి పెద్దూరుకస్పా వరకు రోడ్డు పైన ఉన్న కంకర తేలి గుతలమయమై అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు పది సంవత్సరాల క్రితం టిడిపి ప్రభుత్వంలో ఈ రోడ్డు వేశారని, అప్పటినుంచి ఇప్పటివరకు ఈ రోడ్డు గురించి పట్టించుకున్న నాథుడే లేడని అన్నారు. రామాపురం, గంగానేరు, ఉప్పరపల్లి, వనంకాడపల్లి, టెంకాయ చెట్లపల్లి, వంగిమళ్ళ, డి.రాచాపల్లి, గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన వీరబల్లికు రావాలంటే ఈ రోడ్డుపై ప్రయాణించాల్సి ఉంది. ఎటువంటి చిన్న అవసరమైనా ఈ గ్రామాల ప్రజలు వీరబల్లికి రావాల్సిందేని అన్నారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో తమ వాహనాలు ఎక్కువ మరమ్మతులకు గురవుతున్నాయంటూ ద్విచక్ర వాహదారులు, ఆటో యజమానులు వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో వేగంగా వెళ్లాలంటే భయాందోళన వెళ్లాల్సి వస్తోందని అన్నారు. ఇప్పటికే ఈ రహదారిలో చాలా మంది గాయపడ్డారని తెలిపారు. రోడ్డు మరమ్మతుల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాలకులు, ప్రజా ప్రతి నిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించి ఇబ్బందులు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



పోలుచిన్నారెడ్డిగారిపల్లెలో రోడ్డుపై నిలిచిన నీరు   కంకర తేలిన రోడ్డు

గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు



మా గ్రామానికి పది సంవత్సరాల నుంచి రోడ్డు సౌకర్యం లేదు. టిడిపి ప్రభుత్వ హయాంలో పోలు చెన్నారెడ్డి గారి పల్లెలో రోడ్డుకు కావలసిన భూమిని కొని మట్టి రోడ్డు వేశారు. గతంలో కురిసిన వర్షానికి రోడ్డు గుంతల పడి ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది. వర్షం పడకపోయినా పక్క పొలం వారు వరి నాటితే ఆ పొలంలో నుంచి నీరు రోడ్డుపైకి వచ్చి గుంతలన్నీ నిండి పోతాయి. ప్రభుత్వ అధికారులకు, రాజకీయ నాయకులకు, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు. గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. కూట మి ప్రభు త్వమైన పట్టించుకుని రోడ్డు సౌకర్యాన్ని కల్పిస్తుందని కోరుతున్నాం.

-ఇందిరెడ్డి నరసింహారెడ్డి, నాగిరెడ్డిగారిపల్లి.


ప్రయాణం చేయాలంటే కష్టం

ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే కష్టంగా ఉంది. రోడ్డు వేసి పది సంవత్సరాలు అయ్యింది. మాండవ్య నది పైన, గాంగనేరు వాగుపైనా బ్రిడ్జి కట్టారు. గతంలో కురిసిన వర్షానికి బ్రిడ్జి కొట్టక పోయింది. ఇంతవరకు ప్రభుత్వ అధికారులు గాని పాలకులు గాని పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి రోడ్డు వేయాలి.

-షేక్ శేఖూర్, వంగిమళ్ళ పెద్దూరు.

ఘనంగా విజయదశమి వేడుకలు

వాసవికన్యకా పరమేశ్వరిదేవి సన్నిధిలో 'ఆకేపాటి'



గుర్రంకొండ : మహిషాసుర మర్దినిదేవి అలంకరణలో రెడ్డెమ్మ

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవిని శుక్రవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చండీ హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాజంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, మండల మాజీ కన్వీనర్ సిద్ధవరం గోపిరెడ్డి, గడికోట వెంకట సుబ్బారెడ్డి, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి ఆర్యవైశ్య సంఘసభ్యులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకన్యకాపరమేశ్వరి దేవిని దర్శించుకున్న 'బత్యాల'

రాజంపేట : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజంపేట పట్టణంలోని శ్రీ మత్కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో శ్రీ ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ఉత్సవ కమిటీ వారి ఆహ్వానం మేరకు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగలరాయుడు శ్రీమహిషాసురమర్దిని అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిమ్మనపల్లి పెద్దమాదిగ పల్లిలోని మాతమ్మతల్లి ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక అలంకరణలతో అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయాన్ని విశేష విద్యుత్ దీపాలంకరణ, ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు. **గుర్రంకొండ :** మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ఉన్న రెడ్డమ్మ దేవత దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిదవ రోజు శుక్రవారం మహిషాసుర మర్దినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, పరిమళభరిత పుష్పాలతో అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పూజలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొట్లి రామిరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయ దారులుగా వ్యవహరించారు. పదవ రోజు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమి స్తారని ఆలయ ఇఒ మంజుల తెలిపారు. **కలికిరి:** మండలంలోని పత్తేగడ పంచాయితీ తెల్లగుట్టపల్లిలోని తిరుపతి గంగమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాకులు అమ్మవారిని విశేషా లంకారణ చేసి అర్చనలు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయనిర్వాహకులు అగస్తేశ్వర్, మంగమ్మ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సర్పంచ్‌లపై బురదజల్లడం మానుకోవాలి

ప్రజాశక్తి-వీరబల్లి



విలేకరులతో మాట్లాడుతున్న వీరబల్లి సర్పంచ్‌లు

కూటమి పార్టీలో కొందరు వర్గ నాయకులు గ్రామ అభివృద్ధికి సహకరించడం మాని నిధులు స్వాహా చేశారని ఫిర్యాదులు చేసి సర్పంచ్‌లపై బురద చల్లడం మానుకోవాలని సర్పంచుల అధ్యక్షుడు నేతి ఆంజనేయులు, నాగార్జున, గోపీనాథ్‌రెడ్డిలు పేర్కొన్నారు. గ్రామాల్లో చేసిన పనులకి నిధులు రాకుంటే తాము ఎక్కడ స్వాహాకు పాల్పడ్డామో వారు నిరూపించాలని అన్నారు. మేరా యాప్‌లో తప్పుడు ప్రచారం ఉందని ఆ సమాచారంతో తాము స్వాహా చేశామని చెబుతున్నారని పేర్కొన్నారు. వీధిలైట్లకు నిధులు డ్రా చేయకుండానే చేశామని చెప్పడం దారుణంగా ఉందన్నారు. గ్రామాల్లో పరిశీలిస్తే చేసిన పనులు ఏమిటో అర్థమవుతుందని తెలిపారు. ఇలా ఫిర్యాదులు చేయడం మానుకోవాలన్నారు. మారుమూల మండలమైన వీరబల్లిలో తాగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని అన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేయాల్సింది పోయి స్వాహా చేశారంటూ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులపై ఫిర్యాదులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ఏ నిధులు రాకపోగా ప్రస్తుతం డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పంచాయతీలకు నిధులు వేశారన్నారు. వాటిని ప్రాధాన్యత పనులకు ఉపయోగిస్తున్నామే తప్ప ఎక్కడ దుర్వి నియోగం చేసిన దాఖలాలు లేవని చెప్పారు. ఇలా గ్రామాల్లో సర్పంచులకు ఇబ్బందులు కలిగిస్తే 14న వచ్చే పల్లె పండగ కార్యక్రమానికి తాము ఎలా సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షులు గాలివీటి వీరనాగిరెడ్డి, ఈశ్వరయ్య, శివ, రవికుమార్ పాల్గొన్నారు.

తపాలా సేవలు విస్తృతపరచడం మనందరి కర్తవ్యం



ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న నరసప్ప

ప్రజాశక్తి-పీలేరు

తపాలా సేవలు క్షేత్రస్థాయికి విస్తృతపరచడం మనందరి కర్తవ్యమని తిరుపతి డివిజన్ తపాలా శాఖ సీనియర్ ఎస్‌పి బి.నరసప్ప తెలిపారు. శుక్రవారం పీలేరు తపాలా కార్యాలయంలో తపాలా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా తపాలా శాఖలోని అన్ని పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రతిభ కనబరిచిన బిపిఎం లావణ్య, ఎబిపిఎం మాధవి, ప్యాకర్లు ఫాతిమా బేగం, జాహ్నవిలకు ప్రోత్సాహక బహు మతులను అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ తిరుపతి డివిజన్ పరిధిలో మొత్తం 393 గ్రామీణ తపాలా శాఖలున్నాయని, తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరిలో మూడు ప్రధాన తపాలా కార్యాలయాలు నడుస్తున్నాయన్నారు. వీటికి అనుబం ధంగా 29 తపాలా డివిజన్లతో పాటు 69 సబ్ ఆఫీసులు ఉన్నాయని చెప్పారు. అన్ని గ్రామీణ తపాలా శాఖల్లోనూ ఇప్పటివరకు 8,59,344 మంది వివిధ రకాల ఖాతాలు కలిగి ఉన్నారని ఆయన వివరించారు. వారం రోజుల్లో జరిగిన వారోత్సవాల్లో పీలేరు డివిజన్ పరిధిలో ఆరు 5 స్టార్ గ్రామాలు, 30 సుకన్య గ్రామాలు, 6 బీమా గ్రామాలలో సభ్యులను ఎంపిక చేశారని పేర్కొన్నారు. తిరుపతి నుంచి వచ్చే తపాలా బ్యాగులను పీలేరు బస్టాండు నుంచి తమ సిబ్బంది సుండుపల్లి మార్గంలో చీనేపల్లికి, రాయచోటి మార్గంలో కలకడకు, తలుపుల మార్గంలో బసన్న గారిపల్లి వరకు రోజూ తపాలా బ్యాగులను చేరవేస్తున్నారని చెప్పారు. తపాలా సేవలను అందరికీ చేరవేయడంలో సిబ్బందిని ప్రోత్సహిస్తున్న పీలేరు తపాలా ఇన్స్‌పెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పలువురు తపాలా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

15న లక్ష్మీ వృద్ధాశ్రమం ప్రారంభం

ప్రజాశక్తి-రాయచోటి



లక్ష్మీ వృద్ధాశ్రమం

పట్టణంలోని తిరుపతి నాయుడు కాలనీలో అర్చన విజ్ఞాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం లక్ష్మీ వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు అర్చన విద్యాసంస్థల అధినేత డాక్టర్ పి.మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి రవాణా,క్రీడ యువజన మంత్రి వర్యులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర, అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఎటువంటి ఆదరణలేని 60 ఏళ్ళు పైబడిన వృద్ధులకు ఉచితంగా భోజనం, నివాసం, వైద్యం తదితర అన్ని సౌకర్యాలను ఇక్కడ కల్పించడం జరుగుతుందన్నారు. వృద్ధులకు చేయూతనిచ్చే ఈ వృద్ధాశ్రమం గురించి మీకు తెలిసిన ఎటువంటి ఆదరణ లేని వృద్ధులకు తెలియపరచాలని ఆయన స్వచ్ఛంద సేవ, యువజన, ఉద్యోగ, ప్రజా సంఘాలకు, ప్రజా ప్రతినిధులుకు ఆయన విన్నవించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు, ప్రజలు ప్రతి ఒక్కరూ స్వచ్ఛం దంగా హాజరు కావాలని ఆయన కోరారు.వృద్ధులకు చేయూత నిచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న రూపానందరెడ్డి, శ్రీధర్

అట్టహాసంగా ప్రారంభమైన వాలీబాల్ పోటీలు

- పోటీల్లో పాల్గొన్న 26 జట్లు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని మంగంపేట గ్రామంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను శుక్రవారం రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలని పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహ కులకు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించి జాతీయస్థాయిలో అద్భుత ప్రతిభ కనబరచాలని పేర్కొన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడాకారులు క్రీడల్లో పాల్గొన డం అలవాటు చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర, జాతీయ క్రీడల్లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకా రులకు ఉద్యోగ అవకాశాల్లో ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని అన్నారు. ఆర్గనైజర్స్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 26 జట్లు పోటీ పడుతున్నాయని తెలిపారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని సూచించారు. గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.35వేలు అందివ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయి వికాస్‌రెడ్డి, విశాల్‌రెడ్డి, క్రీడాకారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



లబ్దిదారులకు వంటనూనె అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

తక్కువ ధరకే వంట నూనెలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి రైల్వేకోడూరు

రేషన్‌కార్డుపై తక్కువ ధరకే వంట నూనెలు సరఫరా చేస్తున్నామని ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని రేషన్ దుకాణం వద్ద టిడిపి యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డితో కలిసి రాయితీతో వంట నూనెలను లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాల్లో శుక్రవారం నుంచి నెలాఖరు వరకు పామోలిన్ లీటరు రూ.110, సన్ ఫ్లవర్‌ఆయిల్ లీటరు రూ.124 చొప్పున విక్రయించనున్నట్లు తెలిపారు. ఒక్కో రేషన్ కార్డ్ పై మూడు లీటర్ల పామోలిన్, ఒక లీటరు సన్ ఫ్లవర్ ఆయిల్ చొప్పున అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎన్.హేమరాజ్, పి.నవీన్, అరవింద్, మల్లంకొండ నవీన్ పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సుకు పనిచేసే నాయకుడు 'పెద్దిరెడ్డి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

నిరంతరం ప్రజా శ్రేయస్సుకు పరితపించే నాయకుడు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్ఎ. కరీముల్లా పేర్కొ న్నారు. స్థానిక 14వ వార్డులోని వైసిపి కార్యాలయంలో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపు కున్నారు.ఈ కార్యక్రమానికి 14 వార్డు కౌన్సిలర్ షేక్ షబానా, మాజీ కౌన్సిలర్ హస్మత్ జాన్, రమాదేవి, షంతాజ్, సుమియా, మీనా, గీత, రజియా, కావ్య, యర్రం రెడ్డి, వార్డు ప్రజలు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మాజీ మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ స్థానిక ప్రజలకు కేక్, మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాలలో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ప్రజలకు మంచి చేయడంలో పెద్దిరెడ్డి కుటుంబం ఎల్లప్పుడు ముందుంటుందని అన్నారు. ప్రజలకు ఆయన కుటుంబానికి ఎల్లవేళలా మద్దతు నిలుస్తారనిచెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళపై కత్తితో దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పాత కక్షలతో మహిళపై కత్తితో దాడి జరిగిన సంఘటన శుక్రవారం బి.కొత్తకోట మండలంలో వెలుగు చూసింది. బాధితురాలు పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. బి.కొత్తకోట మండలం, గోళ్లపల్లె పంచాయతీ, రఘు నాథపురానికి చెందిన ఎ.రమణమ్మకు అదే ఊరికి చెందిన గణేష్ కు ఆవుల విషయమై పాతకక్షలు ఉన్నాయని అన్నారు. గ్రామంలో జరుగుతున్న గొడవ వద్ద నిలబడి ఉన్న రమణమ్మను గమనించిన గణేష్ చాటుగా వెళ్లి కత్తితో దాడి చేశాడని, ఆమె కేకలు వేయడంతో పరారైనట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ద్విచక్రవాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం వేకువజామున వాల్మీకిపురం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కొత్త ఇందిరమ్మ కాలనీకి చెందిన రెడ్డిఖాన్(72) తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడని అన్నారు. గురువారం రాత్రి రెడ్డిఖాన్ వ్యాపారం ముగించుకుని ఇంటికి తోపుడు బండిని తోసుకొని వెళ్తుండగా ఇందిరమ్మ కాలనీ సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో రెడ్డిఖాన్ తీవ్రంగా గాయపడ్డాడని అన్నారు. గమనించిన స్థానికులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. ప్రథమ చికిత్స అనంతరం మెరు గైన వైద్యం కోసం మదనపల్లికి రెఫర్ చేశారు. అక్కడ పరిస్థితి విషమించడంతో తిరిగి తిరుపతికి తరలించినట్లు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున రెడ్డిఖాన్ మృతి చెందాడని అన్నారు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మిద్దెపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మిద్దె పైనుంచి పడి మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం బి. కొత్తకోట మండలంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు..మండలంలోని బీరంగి పంచాయతీ, గుడిపల్లెకు చెందిన కె.వెంకటరమణమ్మ(63) మిద్దెపైన ఆరవేసిన బట్టలు తెచ్చేందుకు వర్షంలో వెళ్లింది. బట్టలు తీసుకుని మెట్లు దిగుతుండగా ప్రమాద వశాత్తు కాలు జారి కింద పడి తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబీకులు బాధితురాలిని 108లో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అనంతరం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.